# 5. కరదీపిక ఉన్నా కటిక చీకటిలోనే నడక!

అదొక అరణ్య ప్రదేశం. నడిరేయి కటిక చీకటిలో ఓ బాటసారి ప్రయాణిస్తున్నాడు. మినుకు మినుకుమంటున్న నక్షత్రాలను కూడా కారుమబ్బులు కప్పివేయడంతో అతను అడ్డదిడ్డంగా నడుస్తు న్నాడు. అతను నడుస్తున్న దారిలో ఓ పెద్దఅగాధం ఉంది. మరో ఐదు నిమిషాలు అటువైపే నడిస్తే అతను అగాధంలో పడి ప్రాణాలు కోల్పోవడం ఖాయం. అంతలో ఒక వ్యక్తి టార్చిలైట్ తీసుకొని కేకలుపెడ్తూ అతని దగ్గరకు వచ్చాడు. అతని వేషం, వాలకం చూస్తే ఫారెస్టు రేంజర్‌లా ఉన్నాడు.

ఫారెస్టు రేంజర్‌కు ఆ ప్రదేశంలో ఎక్కడ అగాధాలున్నాయో, మరెక్కడ క్రూరజంతువుల గుహలున్నాయో క్షుణ్ణంగా తెలుసు. అందుకే అతను బాటసారికి జరగనున్న ప్రమాదాన్ని పసికట్టి వచ్చాడు. అలా ఇంకాస్త దూరం నడిచివుంటే అగాధంలో పడిపోయి సజీవసమాధి అయ్యేవాడివని బాటసారితో చెబుతూ, అతనికి సరైన దారి చూపాడు. ఎంతో సానుభూతితో రేంజర్ తన టార్చిలైట్‌ని కూడా బాటసారికిచ్చి వెళ్ళిపోయాడు. బాటసారి రేంజర్‌కు కృతజ్ఞతలు చెప్పి ప్రయాణం సాగించాడు. కాస్సేపటికి ఆకాశంలో మబ్బులు వీడి మిలమిల మెరుస్తున్న నక్షత్రాలు కన్పించగానే, ఇక బ్యాటరీలను అనవసరంగా తగలెట్టడం ఎందుకని భావించి అతను టార్చిలైట్‌ని సంచిలో పెట్టుకున్నాడు.

ఈసారి అతను లాటరీలో వచ్చిన లక్షలాది రూపాయల్ని గురించి ఆలోచించసాగాడు. ఈ డబ్బుతో ఓ అందమైన బంగళా కట్టించుకోవాలి. అందులో ఖరీదైన ఫర్నీచర్, టివి, ఫ్రిజ్, సోఫాసెట్ మొదలైన విలాస వస్తువులన్నీ తెచ్చిపెట్టుకోవాలి. మిగతా డబ్బుతో వడ్డీ వ్యాపారం చేసి కూడబెట్టాలి. దానిమీద వచ్చే లాభంతో నైట్ క్లబ్బో, వైన్‌షాపో తెరవాలి. దాని లాభాలతో ఓమంచి సినిమాహాలు కట్టించవచ్చు. ఆ తర్వాత యమ్మెల్యే, ఆపై మినిస్టర్.... ఇలా ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

ఈలోగా నక్షత్రాలు మళ్ళీ కనుమరుగై గాఢాంధకారం అలుముకుంది. ఎత్తయిన టేకువృక్షాలు తలలు విరబోసుకున్న రాకాసుల్లా నిలిచి నేలపై మరిన్ని చీకటిపొరలు పరిచాయి. దాంతో బాటసారి దారితప్పాడు. అతను దీర్ఘాలోచనల్లో మునిగిపోయి చీకటిలో తచ్చాడుతూ నడుస్తున్నాడేగాని, సంచిలోని బ్యాటరీలైట్ తీసి వాడుకోవాలన్న తలంపే అతనికి కలగలేదు. అసలు తన దగ్గర వెలుగునిస్తూ దారిచూపే ఓ టార్చిలైట్ ఉందన్న సంగతే మరచిపోయాడు. పైగా సంచిలో ఓ మూల బరువుగా ఉన్న బ్యాటరీలైట్‌ని పట్టుకొని, దయ్యాలను పారదోలేందుకు ఇవ్వబడిన మంత్రదండమని భావించాడు. ఆ భావనతోనే అతను అంతటి తీవ్రమైన ఆలోచనల్లోనూ అప్పుడప్పుడు దాన్ని కళ్ళకు అద్దుకుంటూ, దాన్ని తనకిచ్చి మేలుచేసిన ఫారెస్టు రేంజర్‌ని తెగ పొగుడుతూ నడుస్తున్నాడు.

నేల మీద ముళ్ళు గుచ్చుకుంటున్నా, ఎదురురాయి దెబ్బలు తగులుతున్నా, చెట్లరెమ్మలు ఒరుసుకుంటున్నా ఖాతరుచేయకుండా హుషారుగా నడుస్తున్నాడు బాటసారి. అది క్రూర మృగాలున్న భయంకరమైన లోయ. మృత్యువు కోరలుచాచి అతనివైపే చూస్తోంది. బాటసారి మరో ఫర్లాంగు నడిస్తే చాలు, అతని దేహంలో ఒక్క మాంసపు ముక్కా మిగలదు. అంతటి ప్రమాదకర స్థితిలో కూడా ఆ బాటసారికి టార్చిలైట్ సంగతి గుర్తుకురాకపోవడం ఆశ్చర్యకరం!



అచ్చం ఇలాగే ఉంది ఈనాటి ముస్లింల పరిస్థితి. వీరు తమకు రుజుమార్గం చూపిన దైవప్రవక్త (స)నైతే ఘనంగా కీర్తిస్తారు. ఆయన కోసం మాటిమాటికి దరూద్ కూడా పఠిస్తారు. కాని ఆయన అందజేసిన దివ్యఖుర్‌ఆన్‌ని బీరువాలో భద్రపరచి అజ్ఞానపు కారుచీకట్లలో తచ్చాడుతున్నారు. వారి జీవితాలపై మూఢాచారాలు, అంధవిశ్వాసాల కారుచీకట్లు ముసురుకున్నాయి. కారుచీకట్లను పారదోలే కరదీపిక లాంటి ఖుర్‌ఆన్‌కు, దాని నిజమైన శిక్షణకు దూరమైపోయారు.

ఇది సామాన్యముస్లింల సంగతి. ఇక ధార్మికులనబడే ముస్లింలు కూడా ఖుర్‌ఆన్ అధ్యయనం చేయడానికి, దాని బోధనలు అర్థంచేసుకోవడానికి ప్రయత్నించడంలేదు. వారిలో కొందరు ఖుర్‌ఆన్‌ని ఇతర భాషల్లోకి అనువదించడం, ఆ అనువాదాలను చదవడం తప్పుగా భావిస్తున్నారు. మరికొందరైతే స్వార్థపరుల చెప్పుడుమాటలు విని సంఘసంస్కరణకు ఉపయోగ పడని కొన్ని వ్యక్తిగత మతాచారాలు పట్టుకొని, అదే అసలైన ఖుర్‌ఆన్ శిక్షణ అని భావిస్తున్నారు.

“నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీలచేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది.” (ఖుర్‌ఆన్). “ఒకవ్యక్తి చేసే నమాజ్ అతడ్ని చెడులు, అశ్లీలచేష్టల నుండి నిరోధించకపోతే అతని నమాజ్ అతడ్ని దేవుని నుండి మరింత దూరం చేస్తుంది” అన్నారు దైవప్రవక్త (స). ఖుర్‌ఆన్‌ని అర్థంచేసుకుంటూ చదివినప్పుడే అది మనిషిని చెడులనుండి నిరోధిస్తుంది. అంటే ఖుర్‌ఆన్‌భాష రానివారు వేరేసమయాల్లో దానిఅనువాదం తప్పక చదువుతుండాలన్న మాట.

ముస్లింలు ఖుర్‌ఆన్‌ని విశ్వసించామని చెప్పుకుంటారు. ఖుర్‌ఆన్‌ని విశ్వసించడమంటే దాని బోధనలను తు.చ. తప్పకుండా ఆచరించాలి; అది ఆదేశించిన విషయాలు పాటించాలి; నిషేధించిన విషయాలు మానేయాలి. “ఎవరు ఖుర్‌ఆన్ నిషేధించిన విషయాల్ని ధర్మసమ్మతం చేసుకున్నాడో అతనసలు ఖుర్‌ఆన్‌ని విశ్వసించనే లేదు.” అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి)

జుఖ్రుఫ్ సూరాలోని 44వ సూక్తిలో “(ముహమ్మద్!) ఈ గ్రంథం నీకు, నీజాతి ప్రజలకు గొప్ప హితకారిణి. త్వరలోనే మీరంతా దీని విషయంలో (దేవుని ముందు) జవాబు చెప్పుకోవలసి ఉంటుంది” అని దేవుడు ముస్లింలను హెచ్చరిస్తున్నాడు.

దీనికి నేటిముస్లింలు దేవునిముందు ఏం సమాధానం చెప్పుకుంటారు? “మేము ఖుర్‌ఆన్ పఠిస్తూనేఉండేవాళ్ళం కదా!” అని చెబుతారా? “అయితే దాని ప్రకారం మీ రెందుకు ఆచ రించలేదు?” అనే మరోప్రశ్న వస్తుంది. దానికి ఏమని సమాధానమిస్తారు? “ఖుర్‌ఆన్ భాష మాకు తెలియదు. అంచేత మేము దానిప్రకారం ఆచరించలేకపోయాం” అని చెబుతారా? “ఖుర్‌ఆన్‌భాష ఎందుకు నేర్చుకోలేదు లేదా మీకు తెలిసినభాషలో దాని అనువాదం ఎందుకు చదవలేదు?” అనే వేరొకప్రశ్న కూడా ఎదురుకావచ్చు. అప్పుడు వారి గతేమిటీ?

“ఖుర్‌ఆన్ పఠించండి. ఇది ప్రళయదినాన తనను పఠించినవారి విముక్తికోసం సిఫారసు చేస్తుంది” అన్నారు దైవప్రవక్త (సల్లం). ఖుర్‌ఆన్ చేసే ఈ సిఫారసు ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదివి, దాని ప్రకారం పూర్తిగా ఆచరించినవారికే వర్తిస్తుంది. దైవం ముస్లిములందరికీ ఖుర్‌ఆన్‌ని అర్థంచేసుకుంటూ చదివే, దానికి ప్రకారం ఆచరించే సద్బుద్ధి ప్రసాదించుగాక.